ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 08 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# దేశం విడిచి పారిపోయిన అధ్యక్షుడు

సిరియా : సిరియాలో అధ్యక్షుడు అసద్ శకం ముగిసినట్లే కనిపిస్తోంది. రాజధాని డెమాస్కస్ సైతం తమ వశమైనట్లు తిరుగుబాటుదారు ప్రకటించారు. ఇవాళతెల్లవారుజామున అసద్ దేశాన్ని విడిచి పారిపోయారు. మరోవైపు ఆయన ప్రయాణిస్తున్న విమానాన్ని రెబల్స్ కూల్చివేశారన్న ప్రచారం ఊపందుకుంది. అయితే అటు రెబల్స్ గాని, ఇటు ప్రభుత్వం గాని ఆ అంశాన్ని ఇంకా నిర్ధారించలేదు. అసద్ పలాయనంతో సిరియాలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని రెబల్స్ చెబుతున్నారు



# ఎయిర్ షో

## ట్యాంక్ బండ్‌పై సాయంత్రం 4 గంటలకు..
## భారీ ఏర్పాట్లు చేసిన అధికారులు
## హాజరుకానున్న సీఎం రేవంత్ మంత్రులు



హైదరాబాద్ : హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర ఇవాళ సాయంత్రం 4 గంటలకు ఎయిర్ షో నిర్వహించనున్నారు. అందుకు దగ్గట్లు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా షో నిర్వహిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. తొమ్మిది సూర్యకిరణ్ విమానాలు పాల్గొంటాయి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, సీనియర్ వైమానిక దళ అధికారులు హాజరుకానున్నారు. ట్యాంక్ బండ్ దగ్గర ఇవాళ సాయంత్రం 4 గంటలకు షో నిర్వహిస్తున్నారు.

# అందుబాటులోకి టీఫైబర్ సేవలు



## ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు
## మీసేవ మొబైల్ యాప్ సైతం..

హైదరాబాద్: టీఫైబర్ సేవలను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. దీని ద్వారా తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజా విజయోత్సవాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీ ఫైబర్ ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీ వినియోగించవచ్చని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సేవలను పరిశీలించి మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. టీ ఫైబర్ ద్వారా సంగారెడ్డి జిల్లా శ్రీరాంపూర్ వాసులతో ఆయన మాట్లాడారు. మీ సేవ మొబైల్ యాప్‌ను శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఇందులో కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతులకు రుణమాఫీ, బోనస్ కోసం మొబైల్ అప్లికేషన్ ప్రారంభించినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.

# కొన్ని హామీలే అమలు

## ప్రభుత్వం ఏర్పడే నాటికి 7 లక్షల కోట్ల అప్పులు
## సంక్షేమం, అభివృద్ధి కొనసాగేలా చర్యలు
## మంత్రి పొంగులేటి

మహబూబ్ నగర్ : ఎన్నికలకు ముందుకు అనేక హామీలు ఇచ్చిన మాట వాస్తవమేనని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంగా కొన్ని హామీలు మాత్రమే అమలు చేశామని మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ లో పర్యటించిన ఆయన అమృత్ తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 5 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్.. 120 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర అప్పు 7లక్షల కోట్ల రూపాయలకు ఎగబాకిందని మంత్రి



మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పడ్డాక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగేవిధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

" మా ప్రభుత్వం వచ్చాక ధరణిలో కొన్ని మార్పులు చేశాం. పోర్టల్ నిర్వహణను ఈ నెల ఒకటో తేదీ నుంచి విదేశీ సంస్థ నుంచి ఎన్ఐసీకి మార్చాం. 2020 ఆర్‌వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్‌వోఆర్ చట్టం తెస్తున్నాం. కొత్త చట్టాన్ని రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేస్తాం. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్య ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది"

# కేసీఆర్ హయాంలోనే యాదాద్రి థర్మల్ ప్లాంట్ పూర్తి

## కొత్త శంకుస్థాపనలు చేసే దమ్ము లేదా?
## మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



హైదరాబాద్ : కేసీఆర్ పూర్తి చేసిన పనులను రేవంత్ ప్రారంభిస్తున్నారని బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి అన్నారు. కొత్తగా శంకుస్థాపనలు చేసే దమ్ములేదా అని ప్రశ్నించారు. తమ హయాంలోనే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పూర్తియ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు ఆలస్యానికి కారణమెవ్వరో త్వరలో చెబుతామన్నారు. కాంగ్రెస్ తల్లి విగ్రహం వాళ్లు పెట్టుకుంటున్నారని, కానీ కాంగ్రెస్ మాత విగ్రహాన్ని సచివాలయంలో పెట్టొద్దన్నారు మాజీమంత్రి జగదీష్‌రెడ్డి.

# పాన్ ఇండియా కాదు తెలుగు ఇండియా సినిమా




## డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ

హైదరాబాద్ : 'పుష్ప 2' హిస్టరీ క్రియేట్ చేసింది. నాన్ హిందీ యాక్టర్ అల్లు అర్జున్ అక్కడ బిగ్గెస్ట్ స్టార్‌గా నిలిచారు. అందుకే ఇది పాన్ ఇండియా కాదు తెలుగు ఇండియా సినిమా అని ఆర్జీవీ పేర్కొన్నారు. అల్లు అర్జున్ హీరోగా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలైన సంగతి తెలిసిందే. ముందురోజు ప్రీమియర్ షో నుంచే హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. మూడు రోజుల్లో హిందీలో రూ.205 కోట్లకుపైగా వసూలు చేసిందని చిత్ర బృందం వెల్లడించింది. వరల్డ్ వైడ్‌గా రెండు రోజుల్లో రూ.500 కోట్ల కలెక్షన్లు రాబట్టింది.